RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 16 అక్టోబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:119



ప్రజాబలం

16 అక్టోంబర్ 2026 శుక్రవారం

# సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్–2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ.13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్–2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి.ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి.తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీ గా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

# జాతీయ సరస్ మేళా 2026ను ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము





విజయవాడ(పున్నమి ఘాట్) విజయవాడలోని పున్నమి ఘాట్ వేదికగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా?2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

లాఖ్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ వెలుపల తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ప్రారంభించారు.సరస్ మేళా ప్రాంగణానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తదితర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.అనంతరం సరస్ మేళా ప్రాంగణంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఎంపీ కేశినేని చిన్ని సందర్శించారు. వివిధ రాష్ట్రాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు, హస్తకళా వస్తువులు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యాపార కార్యకలాపాలను వారు పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు ప్రతీక: గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా

**- లోక్ భవన్ లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు**

**-- బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ దంపతులు**

**-- గౌరమ్మకు గవర్నర్ దంపతుల ప్రత్యేక పూజలు.. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన**





హైదరాబాద్, అక్టోబరు 15, 2026 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు , స్త్రీశక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల్లో ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా అన్నారు. పుష్పాలనే దైవ స్వరూపంగా భావించి పూజించే ప్రకృతి ఉత్సవం బతుకమ్మ పండుగ అని గవర్నర్ పేర్కొన్నారు .

గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి పాల్గొని, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ... పూలతో అలంక రించిన బతుకమ్మ ప్రకృతి సౌందర్యానికి, జీవన వైభవానికి, మానవాళికి ప్రకృతితో ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతిబింబమని అన్నారు. ప్రకృతిని పరిరక్షిం చడం, సహజ వనరులను గౌరవించడం, పర్యావరణం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి విలువలను ఈ పండుగ చాటిచెబుతుందని తెలిపారు.

బతుకమ్మ మహిళల సృజనాత్మకతకు, ఆత్మగౌరవానికి, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. జానపద గీతాలు, కళలు, సంప్రదాయ ఆచారాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని సజీవంగా నిలుపుతున్న మహిళల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ అమూల్యమైన వారసత్వాన్ని పరిరక్షించి, భావితరాలకు అం దించడంప్రతిఒక్కరిబాధ్యతఅనిస్పష్టం చేశారు. ప్రకృతి పరిరక్షణ, మహిళా సాధికారత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యమిస్తూ తెలంగాణ పురోగతి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

లోక్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సుమారు 400 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు . తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు , లోక్‌భవన్ మహిళా ఉద్యోగులు , వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. గౌరీదేవి ప్రతిరూపాల చుట్టూ మహిళలంతా చేరి, చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. కోలాటాల కోలాహలంతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు. కుటుంబ క్షేమాన్ని కాంక్షిస్తూ, తమ సౌభాగ్యాన్ని నిండు నూరేళ్లు కాపాడమంటూ ఆ తల్లిని మనసారా వేడుకున్నారు. అనంతరం బతుకమ్మలను గవర్నర్ సతీమణి శ్రీమతి జానకి శుక్లా, మహిళా ఉద్యోగినులు లోక్ భవన్ లోని కొలనులో నిమజ్జనం చేశారు. కోలాట బృందాల సందడి, బతుకమ్మ పాటల మధురిమతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ కళను సంతరించుకోనుంది.

రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో... లోక్ భవన్

బతుకమ్మ పండుగ వేళ లోక్ భవన్ రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో జిగేల్‌మంటూ వెలిగిపోయింది. పూల పండుగైన బతుకమ్మకు ఈ విద్యుత్ కాంతులు అదనపు శోభను ఇచ్చాయి.

వేడుకల్లో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ శశికిరణ్ కోమందూర్ , ఉప కార్యదర్శి పల్లవి , ప్రెస్ సెక్రెటరీ మామిండ్ల దశరథం ,అధికా రులు , ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు .

# ట్వీట్లతో పోటీ లెక్క తేల్చేస్తున్న పెద్దలు

విజయవాడ అక్టోబరు 15 తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీ యాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్య మంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీ యా ల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాద´రణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారా యణ, ఇతర అధికారులు ముందుండి కార్య క్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. విజయ్ గెలుపును నే సోషల్ మీడియా ట్రోలర్లు పవన్ కల్యాణ్‌ను విజయ్‌తో పోల్చుతూ తీవ్రస్థాయిలో కించప రిచే ప్రయత్నం చేశారు. విజయ్ ఏకంగా సొంతంగా అధికారంలోకి వచ్చారని, పవన్ మాత్రం ఇతర పార్టీల పంచన చేరి డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టుకు న్నారంటూ నీచమైన పోలికలతో ట్రోలింగ్ వార్ నడిపారు. ఇప్పుడు ఒకవేళ విజయ్‌ను కలవడానికి వెళ్లినా, లేదా పక్కన నిలబడినా.. డిజిటల్ మాధ్యమాల్లో మళ్లీ పనిగట్టుకుని లేనిపోని పోలికలు తెచ్చి వ్యక్తిత్వ హననానికి దిగుతా రన్న ముందస్తు అంచనాతోనే పవన్ వ్యూహా త్మకంగా తప్పుకున్నట్లు తెలుస్తోంది.తన ప్రమేయం వల్ల మీడియా ఫోకస్ అసలు చర్చ లైన తెలుగుగంగ, గోదావరి?కావేరి జలాల నుంచి పక్కదారి పట్టి.. అనవసరమైన స్టార్ వార్స్ , పొలిటికల్ ట్రోలింగ్‌గా మారకూడ దన్న ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ పూర్తి పరిపక్వతతో వ్యవహరించారని భావిస్తున్నారు. ప్రత్యర్థులకు ఎలాంటి రాజకీయ ఆయుధాన్ని చేతికి ఇవ్వకూడదన్న వ్యూహంతోనే ఈ టూర్‌కు పూర్తిగా దూరంగా ఉంటూ, ప్రభు త్వం తరఫున చంద్రబాబు?విజయ్ భేటీ సజా వుగా సాగేలా చేశారని అంటున్నారు. ఇద్దరు సౌత్ ఇండియన్ సూపర్ స్టార్లు రాజకీయ వేదికపై ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తారని ఆశపడిన అభిమానులకు నిరాశే మిగిలినప్పటికీ, పవన్ తీసుకున్న ఈ దూరపు నిర్ణయం విమర్శకుల నోళ్లు మూయించేలా వ్యూహాత్మక అడుగుగానే నిలిచిందని అనుకోవచ్చు.

RNI No.TELTEL/2005/16755
ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers



హైదరాబాద్ 16 అక్టోబర్ 2026 శుక్రవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:22 సంచిక:119

# రైతులు వరి పంట వేస్తే నష్టపోతారు

## వరి పంటను ఒక సీజన్ వాయిదా వేసుకోవాలని కోరుతున్నా సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ రాష్ట్రంలో రైతులు వరి పంట వేస్తే నష్టపోతారు. వరి పంటను ఒక సీజన్ వాయిదా వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.గురువారం అయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. సీఎం మాట్లాడుతూ ఒకవేళ మీరు పంటలు వేస్తే.. మేము నీళ్లు అందించలేము. దాంతో పెట్టిన పెట్టుబడి నష్టపోవడంతో పాటు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయని అయన హెచ్చరించారు. దేశాన్ని కాపాడిన రైతులు పెద్ద మనసు చేసుకుని ఒక సీజన్ వరిని వాయిదా వేసుకోవాలని కోరారు.రోజు నీళ్ల కొనలేని పరిస్థితి రాష్ట్రంలో ఉంది. అందుబాటులో ఉన్న 200 టీఎంసీలు తాగడానికే ఉపయోగించుకోవాలి. ఇదే రైతులకు నేను ఇచ్చే సూచన.. చేసే విజ్ఞప్తి అని అన్నారు.తేడాది 462 టీఎంసీల నీళ్ల ఉండే.. కానీ ఈరోజు 209 టీఎంసీల నీళ్లే ఉన్నాయి. ఈ నీటిని ఇప్పుడు పంటలకు ఇవ్వలేం. ఒకవేళ ఇస్తే.. తాగడానికి నీళ్లు ఉండవని అన్నారు. రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఆచితూచి వినియోగించుకోవాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మార్చి నెలలో ఉండాల్సిన ఉష్ణోగ్రతలు అక్టోబర్‌లోనే నమోదవుతున్నాయని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని చెప్పారు.ఎంత ధర చెల్లించడానికైనా మేం ముందుకొచ్చినా.. విద్యుత్ దొరకని పరిస్థితి వచ్చింది. అయినా మేము అందరినీ ఆదుకొని.. రైతుల పంటలు దెబ్బతినకుండా కాపాడుకున్నాం. రైతులకు 20వేల మూడు మెగా వాట్ల విద్యుత్తును అందించాం. చరిత్రలో ఏ రోజూ ఈ స్థాయిలో విద్యుత్ వినియోగం జరగలేదు. ఎన్నో రకాలుగా తిప్పలు పడి.. మార్కెట్ డిమాండ్‌ను సరఫరా చేశామని అన్నారు.ఎల్‌నినో’ విపత్తు మొత్తం ప్రపంచాన్నే దెబ్బ తీస్తుందని.. మేము 2026 ప్రారంభంలోనే చర్చించాం. వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు మమ్మల్ని హెచ్చరించినా.. నేడు పరిస్థితి చెయ్యి దాటిపోయిందని అన్నారు.పక్క రాష్ట్రం ఏపీలో బయట సంస్థల దగ్గర ఒక్క యూనిట్ విద్యుత్ రూ.15కు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారని అన్నారు. 1950 తర్వాత ఎన్నో సందర్భాల్లో ఎల్‌నినో వచ్చినప్పటికీ, ఈసారి అది మరింత తీవ్రమై సూపర్ ఎల్‌నినోగా మారే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారని చెప్పారు. ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు ముందస్తు చర్యలు చేపట ్టడంతో పాటు ప్రజలు, రైతులు, పశుసంపదను కాపాడేందుకు స్పష్టమైన కార్యాచరణ అవసరమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..

## మహిళల భాగస్వామ్యం కీలకం: రాష్ట్రపతి ముర్ము



వార్తా 4 లో

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
సింగిల్ విండో ద్వారా అనుమతులు..
భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటాను
రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు భట్టి భరోసా
సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో భట్టి విక్రమార్క



వార్తా 4 లో

# మనం చేసి చూపిద్దాం’...
# ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు

వార్తా 4 లో



# సీఎం రేవంత్ ఆదేశాల అమలు..

విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్
యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక

హైదరాబాద్ తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా



పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

# సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్
ప్రజా సంక్షేమాన్ని వదిలి కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని ఫైర్



వార్తా 4 లో

# 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్.. మహిళల భాగస్వామ్యం కీలకం: రాష్ట్రపతి ముర్ము

విజయవాడ, అక్టోబర్ 15 పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి అంటే గ్రామాల వికాసమని చెప్పుకొచ్చారు. మహిళల స్టాళ్లను సందర్శించే అవకాశం దక్కిందని.. వారి ఉత్సాహం, వారి ముఖాల్లోని చిరునవ్వు చూస్తుంటే మహిళలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. ఒకప్పుడు మహిళలు వెనుకబడి ఉండేవారని.. కేవలం కుటుంబ సంరక్షణకే పరిమితమై, ఆర్థికంగా చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ నేడు మహిళలు సంపూర్ణంగా స్వయం సమృద్ధి సాధించారన్నారు. ఇతరులకు ఆసరాగా మహిళలుమహిళలు కేవలం స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, ఇతరులకు కూడా ఆసరాగా నిలుస్తున్నారని ముర్ము తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన, మహిళల సంకల్పం దేశంలోని ముఖ్యమంత్రులందరి ఉమ్మడి కృషి ఫలితంగా మహిళా సాధికారత ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. 2047 కంటే ముందే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు. మహిళల భాగస్వామ్యం పెరిగిందివ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదని రాష్ట్రపతి వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక సామాజిక సాధికారత దిశగా కొత్త మార్గం లభించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, కుటుంబంలో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. భారతదేశం భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ అంతా ఒక్కటే అని అన్నారు. గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ప్రాధాన్యంప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారని ద్రౌపది ముర్ము అన్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి సంకోచించిన మహిళలు, నేడు ఎవరి సాయం లేకుండా స్వయంగా బ్యాంకులకు వెళ్లి తమ పనులను స్వతంత్రంగా చక్కబెట్టుకుంటున్నారని తెలిపారు. అంత్యోదయ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలే గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన వేగం, దిశానిర్దేశం అందించిందన్నారు. నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు..డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ, వారికి నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ముర్ము అన్నారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో అక్కడి గ్రామీణ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఆ మహిళలు ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తూ ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం పొందుతున్నారు, భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి అనే వివరాలను స్వయంగా ల్యాప్‌టాప్‌లలో నమోదు చేసుకుంటూ పనులు చేసుకునేవారని తెలిపారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

## సీఎంవోలో 15 శాతం కమీషన్ దందా: రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.
తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.
ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

### పోలీసుల అదుపులో లేడీ డాన్ సులోచన

అన్నమయ్య జిల్లా కేంద్రంలోని మదనపల్లె, తదితర ప్రాంతాల్లో భూ కబ్జాలు చేసి అమాయకులను మోసం చేస్తూ,14 కేసుల్లో నిందితురాలుగా రౌడీ షీట్ కలిగి ఉన్న లేడీ డాన్ కోనేటి సులోచనను పోలీసులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లె పట్టణం నీరుగట్టుపల్లికి చెందిన సులోచనపై ఇప్పటికే మదనపల్లె 1టౌన్, 2టౌన్, తాలూక తదితర పోలీస్ స్టేషన్లలో 14 చీటింగ్ కేసులతో పాటు భూ కబ్జా, హత్యా యత్నం వంటి కేసులు నమోదై ఉన్నాయి. జిల్లా ఎస్పీ ధీరజ్, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డిఎస్పీ ప్రసాద్ ల ఆదేశాలతో వన్ టౌన్ పోలీసులు సులోచనను అదుపులోకి తీసుకున్నారు

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

"తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.
హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.
పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం హైదరాబాద్‌ను పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనేక అనుకూలతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు.
ప్రాచీన కాలం నుంచి హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారులను, పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని, మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు.
మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక
హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (కోర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, మౌలిక సదుపాయాలు, సేవారంగానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పెరి అర్బన్ ప్రాంతంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భవిష్యత్తులో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని అనుసంధానిస్తూ రేడియల్ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే 21 రేడియల్ రోడ్లకు సంబంధించి మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ రహదారుల అనుసంధానంతో ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు.
సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర
మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.
?ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించేవారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.
పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.
అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలి
సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక వర్గం మాత్రమే అభివృద్ధి చెందడం సంపూర్ణ ప్రగతి కాదని, తమతోపాటు మరో పదిమందిని ముందుకు తీసుకెళ్లినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క, వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

# మనం చేసి చూపిద్దాం'... ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "మనం చేసి చూపిద్దాం" అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.
పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. "మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్ఛస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.
చారిత్రక విజయాలపై ప్రశంసలు
ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ 'డబుల్ గోల్డ్స్' సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు.
భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.
క్రీడారంగానికి ప్రభుత్వ అండ
గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్), 'ఖేలో ఇండియా' వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు 'టాప్స్' కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.
గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా 'టాలెంట్ హంట్' నిర్వహిస్తామని చెప్పారు.

## జోగిపేట 15వ వార్డు లో వైస్ చైర్మన్ సత్యనారాయణ (చిట్టిబాబు) ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :అందోల్ – జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 15,వార్డు లో ఘనంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, (చిట్టిబాబు,రాధిక,)ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు జరిగాయి, రంగు రంగుల పూలతో పువ్వులతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో చిన్నారుల ఆనందోత్సవాల మద్య, బతుకమ్మ ఆటలు వార్డు మహిళలతో ( రాధిక చిట్టిబాబు) బతుకమ్మఆటలుఆడారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, (చిట్టిబాబు) మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఎంతో ఆనందంగా బతుకమ్మను పేర్చారుఅని కుటుంబంలో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని బతుకమ్మ ఆశీస్సులు ప్రతి కుటుంబం పైన ఎల్లవేళలా ఉండాలని (చిట్టిబాబు)అన్నారు, అంతేకాకుండా ప్రతి ఒక్కరికి పేరుపేరునా బతుకమ్మ శుభాకాంక్షలు అని కూడా ఆయన తెలిపారు



## జర్నలిస్టులపై దాడి ఆరోపణలు.. బాధ్యులను సస్పెండ్ చేయాలి

### ఎస్ఐ శ్రీకాంత్‌పై స్వతంత్ర విచారణ జరిపించాలి: మహంకాళి బిక్షపతి



**మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 15:**వార్తా కథనాలు ప్రచురించిన జర్నలిస్టులు సంపత్, 'ఏక్ దమ్ న్యూస్' ఎడిటర్ పొత్తూరి శేఖర్‌లపై పోలీసులు దాడి చేసి, థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలను తెలంగాణ మాదిగ అనుబంధ ఉపకులాల జర్నలిస్టుల రాష్ట్ర కార్యదర్శి మహంకాళి బిక్షపతి (భిక్షు) తీవ్రంగా ఖండించారు. గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్‌తోపాటు ఘటనకు బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్‌లో జరిగిన ఈ ఘటనపై బాధితుల ఆరోపణలను ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించాలని కోరారు. పోలీసుల అదుపులో ఉన్న సమయంలో తమను కొట్టారని, చిత్రహింసలకు గురిచేశారని బాధితులు ఆరోపించినట్లు తెలిపారు. ఈ ఘటనపై వైద్య నివేదికలు, పోలీస్ స్టేషన్ల సీసీ కెమెరాల దృశ్యాలు, అరెస్టు రికార్డులు సహా సంబంధిత ఆధారాలను భద్రపరచి, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని పేర్కొన్నారు. అరెస్టు సమయంలో చట్టపరమైన నిబంధనలు పాటించారా? బాధితులకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారా? అనే అంశాలనూ విచారణలో తేల్చాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్యం, రక్షణ కల్పించాలని కోరారు. వార్తలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలే తప్ప, జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సమర్థనీయం కాదన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని, చర్యలు తీసుకోకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని మహంకాళి బిక్షపతి హెచ్చరించారు. ఈ ఘటనను జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.

## మహిళా రైతులకు ఘన సన్మానంలి

## వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 15:** మహిళా రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని షామీర్‌పేటలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మహిళా రైతులను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో మహిళా రైతులు అందిస్తున్న సేవలను అధికారులు కొనియాడారు. పంటల సాగు నుంచి విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, పంటల సంరక్షణ వరకు మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తి పెంపుతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి మహిళా రైతుల కృషి ఎంతో దోహదపడుతోందన్నారు.

మహిళా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, వ్యవసాయ శాఖ అందించే ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సూచనలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో మహిళా రైతులు సరసం లక్ష్మి, వంగేటి సమత, బాలమణితో పాటు పలువురు మహిళా రైతులను సత్కరించి అభినందించారు.

## హైదరాబాద్ మెట్రో అనాథ !

హైదరాబాద్ అక్టోబరు 15 దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వ్యాపార హబ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ విషయంలో మాత్రం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే వెనుకబడిపోతోంది. ఢిల్లీ 390 కిలోమీటర్లకు పైగా ట్రాక్‌తో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేల కోట్ల కేంద్ర నిధులతో తమ రెండో, మూడో దశ పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నాయి. కానీ భాగ్యనగరంలో మొదటి దశ 69 కిలోమీటర్ల మేర పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, రెండో దశ విస్తరణ మాత్రం ఫైళ్ల దశను దాటి పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 38 వేల కోట్లకు పైగా అంచనాతో 122 కిలోమీటర్ల పైబడిన ఫేజ్–2 డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పిస్తున్నప్పటికీ.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి రావాల్సిన కీలక ఆమోదాలు, నిధుల భాగస్వామ్యంపై ఏకాభిప్రాయం రావడం లేదు. ఉత్తరాది నగరాల ప్రాజెక్టులకు, మహారాష్ట్ర, గుజరాత్ మెట్రో నెట్‌వర్క్‌లకు కేంద్ర బడ్జెట్‌లలో వేల కోట్ల రూపాయలను కేటాయిస్తున్న మోదీ సర్కార్.. దేశానికే భారీగా పన్నులు చెల్లిస్తున్న హైదరాబాద్ మెట్రో విషయానికి వచ్చేసరికి మాత్రం కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.హైదరాబాద్‌కు గనక సమగ్రమైన ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు అందితే.. అది ముంబై, బెంగళూరులను సైతం వెనక్కి నెట్టి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరిస్తుందన్న వాస్తవం కేంద్ర పెద్దలకు తెలియంది కాదు. తక్కువ జీవన వ్యయం, మెరుగైన శాంతిభద్రతలు, ఐటీ–ఫార్మా రంగాల్లో అపార అవకాశాలు ఉన్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా మెట్రో పూర్తయితే అంతర్జాతీయ పెట్టుబడులన్నీ ఇక్కడికే పోటెత్తుతాయి. అందుకే, ఇతర రాష్ట్రాల నగరాల పోటీతత్వాన్ని కాపాడేందుకు హైదరాబాద్‌పై ఆర్థిక, మౌలిక వసతులపరమైన ఆంక్షలు పరోక్షంగా అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.రాజకీయ నాయకత్వ బలహీనతలు, కేంద్ర వివక్ష కారణంగా అంతిమంగా నష్టపోతున్నది సామాన్య హైదరాబాద్ పౌరుడే. ట్రాఫిక్ రద్దీతో నిత్యం నరకం చూస్తున్న ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు మెట్రో విస్తరణ కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కేంద్రం హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు కేంద్రం తక్షణమే సంపూర్ణ అనుమతులు మంజూరు చేసి, తన వాటా నిధులను విడుదల చేయాల్సిన చారిత్రక అవసరం ఉంది. లేకపోతే దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మహానగరానికి అన్యాయం చేసినట్లే అవుతుంది

## ఓట్ల తొలగింపుపై గల్లీ మౌనం – రోడ్డెక్కని బాధితుల పోరాటాలు!

హైదరాబాద్ అక్టోబరు 15 తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఊహించని రీతిలో రికార్డు స్థాయి ఓట్ల కోతకు దారితీస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఉన్న సుమారు 3.38 కోట్ల ఓటర్ల జాబితాలోంచి ఏకంగా 73.39 లక్షల ఓట్లను అంటే దాదాపు 21.7% పైగా తొలి విడత డ్రాఫ్ట్ రోల్‌లోనే తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరణించినవారు 9.22 లక్షలు , శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు 45.18 లక్షలు , అడ్రస్‌లో లేనివారు 11.25 లక్షలు , రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు 6.70 లక్షలు అనే వర్గీకరణ కింద ఈ భారీ ఓట్ల తొలగింపు జరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు 40 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయి.ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిళ్లలోపెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోఉన్నప్పటికీ, సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్–7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది.

కేవలం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ లాంటి నియోజకవర్గాలకే తమ ఫిర్యాదులను పరిమితం చేస్తూ, సచివాలయం, గాంధీ భవన్ గదులకే కాంగ్రెస్ పోరాటం పరిమితమైందనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన ప్రతినిధులేనా అనే అనుమానం ఎక్కువగా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణ ప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి ఫారమ్–6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్ పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.

## మొజాంజాహీ మార్కెట్ సమీపంలో 35 అంతస్తుల భవన

హైదరాబాద్ అక్టోబరు 15 హైదరాబాద్ నగర చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచే మొజాంజాహీ మార్కెట్ సమీపంలో 35 అంతస్తుల భారీ ఆకాశహర్మ్యం నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంపై తెలంగాణ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అబిడ్స్ సమీపంలోని గన్‌ఫౌండ్రీ పరిధిలో మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన మీనాక్షి ఎలీసియా ప్రాజెక్టు చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. సొసైటీ ఫర్ క్రూసేడ్ అగైనెస్ట్ కరప్షన్ దాఖలు చేసిన ఈ ప్రజాహిత వ్యాజ్యంలో.. 2022 ఆగస్టు 23న జారీ చేసిన భవన నిర్మాణ అనుమతి నిబంధనలకు విరుద్ధంగా ఉందని, అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పాటించకుండానే అధికారులు అనుమతులు ఇచ్చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.ఈ విచారణ సందర్భంగా భవనం ఎత్తు, నిర్మాణ విస్తీర్ణంపై న్యాయస్థానం ఆరా తీసింది. ఈ ప్రాజెక్టులో 2 సెల్లార్ లెవల్స్, మరో 5 ప్రత్యేక లెవల్స్‌తో పాటు ఏకంగా 35 అంతస్తుల నిర్మాణం జరుగుతోందని తెలియడంతో ధర్మాసనం నివ్వెరపోయింది. శతాబ్దాల చరిత్ర కలిగిన మొజాంజాహీ మార్కెట్ వంటి హెరిటేజ్ నిర్మాణాల పరిసరాల్లో ఇంతటి భారీ ఎత్తుగల కట్టడానికి అధికారులు ఏ ప్రాతిపదికన అనుమతులు మంజూరు చేశారంటూ న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆధునిక ఆకాశహర్మ్యాల వల్ల పురాతన చారిత్రక కట్టడాల ఉనికి కనుమరుగై పోతోందని, హెరిటేజ్ ల్యాండ్‌మార్క్‌లను పూర్తిగా కప్పివేసేలా అధిక అంతస్తుల భవనాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనుక హేతుబద్ధత ఏమిటని జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యతను కోర్టు గుర్తుచేసింది.అయితే, డెవలపర్ తరఫున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జీహెచ్ఎంసీ సహా సంబంధిత అన్ని ప్రభుత్వ విభాగాల నుంచి తాము అవసరమైన నిరభ్యంతర పత్రాలు , చట్టబద్ధమైన అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు చేపట్టామని స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా పిటిషనర్ న్యాయవాది బదులిస్తూ.. బిల్డర్ దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ కేవలం ఆరోపణలను ఖండించడానికి మాత్రమే పరిమితమైందని, ప్రాజెక్టు వల్ల తలెత్తే తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ప్రమాదాలు, నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలపై ఎటువంటి సరైన సమాధానం ఇవ్వలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అన్ని నిబంధనలు పూర్తిగా నెరవేరే వరకు నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఇదే సమయంలో, సదరు ప్రాజెక్టుపై ఇలాంటి ఆరోపణలతోనే గతంలో దాఖలైన మరో పిటిషన్ కూడా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని డెవలపర్ కౌన్సిల్ కోర్టుకు తెలియజేస్తూ, ఆ రెండు అంశాలను కలిపి విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఆ రెండో పిటిషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి సమగ్ర వాదనలు వినిపించేందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది గడువు కోరారు. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను నమోదు చేసుకున్న హైకోర్టు బెంచ్.. ఆ పెండింగ్ కేసు నంబరు, వివరాలను జాబితా చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

# రూ.8 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, ప్రైవేట్ ఆపరేటర్

## గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం బాధితుడికి ఇబ్బందులు.. సెప్టెంబర్ 24న స్లాట్ బుకింగ్

**వేములవాడ రూరల్, అక్టోబర్ 15 (ప్రజాబలం):** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. రూ.8 వేల లంచం తీసుకున్న వ్యవహారంలో తహసీల్దార్ కమ్ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఎం. అబుబకర్, భూ భారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి సంకసాల అనిల్ కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి అత్తకు చెందిన వ్యవసాయ భూమిని ఆయన తండ్రి పేరుపై గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు సహకరించే విషయంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు సెప్టెంబర్ 24వ తేదీన స్లాట్ బుకింగ్ చేసుకున్నప్పటికీ, వివిధ కారణాలతో ఇబ్బందులకు గురిచేసినట్లు ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి తెలిపారు.ఈ వ్యవహారంపై చర్యలు చేపట్టిన ఏసీబీ అధికారులు రూ.8 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తహసీల్దార్ అబుబకర్, ప్రైవేట్ ఆపరేటర్ అనిల్ కుమార్‌లను కరీంనగర్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా పనుల కోసం లంచం డిమాండ్ చేస్తే ప్రజలు నిర్భయంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.





# వేములవాడలో బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

## రూ.34 లక్షలతో ఏర్పాట్లు పూర్తి : విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (అక్టోబర్ – 15) ప్రజాబలం:** వేములవాడలో బతుకమ్మ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.34 లక్షల అంచనా వ్యయంతో మూలవాగు వద్ద నిమజ్జనానికి విశాలమైన ప్రదేశం, ప్రత్యేక లైటింగ్, బతుకమ్మ గార్డెన్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జనోత్సవానికి 35 వేల మందికి పైగా మహిళలు, భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున పోలీసు బందోబస్తుతోపాటు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వేములవాడలో ఏడు రోజులపాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకత అని పేర్కొంటూ రాష్ట్ర ప్రజలకు ముందస్తు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ -- ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఐఎఎస్.







**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ, మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుక అని ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు.

గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొని పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోందని అన్నారు.

మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రకృతిని గౌరవిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, రెవెన్యూ తదితర శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిడిపిఒలు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జోగిపేటలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఘనంగా బతుకమ్మ సంబురాలు

## అందోల్ జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ ఎస్ కిష్టారెడ్డి, కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్.

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్15 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,వైభవానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అందోల్– జోగిపేట, మున్సిపాలిటీ చైర్మన్ ఎస్, కిష్టారెడ్డి , కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్, పేర్కొన్నారు.అందోల్,–జోగిపేటమున్సిపాలిటీఆధ్వర్యంలో (బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మపూజాకార్యక్రమాలు,నిర్వహించి, ఈసందర్భగా చైర్మన్ ఎస్, కిష్టారెడ్డి , పట్లోల్ల రేఖ ప్రవీణ్, మాట్లాడుతూ, రంగురంగుల





పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతోఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణసంస్కృతి ,సంప్రదాయాలకు, ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు, బతుకమ్మను తెలంగాణ ఇంటి మహాలక్ష్మిగా భావిస్తారని పేర్కొన్నారు, పండుగ విశిష్టతను చాటిచెప్పేలా ఆహ్లాదకరమైన వాతావరణంలోవేడుకలునిర్వహించారు,బతుకమ్మసంబురాలు,జోగిపేట, మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో పెద్దఎత్తున నిర్వహించారు ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి , మున్సిపల్ ఏఈ,అధికారులు కౌన్సిలర్స్ పట్లోల్ల శ్రీనివాస్, మర్రి అరుణ్ కుమార్, రాచకొండ నాగరత్నం గౌడ్, నాని నాగరాజు, కొత్త శ్రీశైలం, మాజీ చైర్మన్ మల్లయ్య, ప్రదీప్ గౌడ్, పట్లూరి శివశంకర్, రామాగౌడ్, చాపల వెంకటేశం, తదితరులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు....

# భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిశుభాకాంక్షలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** :కలలు కనండి.. వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి యువతలో స్ఫూర్తిని నింపి, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులుఅర్పిస్తున్నాను.

వారి జీవితం, ఆశయాలు, దేశం పట్ల అంకితభావం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. దామోదర్ రాజనర్సింహ,తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి వర్యులు.

# సద్దుల బతుకమ్మ వేడుకలకు ట్రాఫిక్ ఆంక్షలు

## 16న మధ్యాహ్నం 3 గంటల నుంచి అమలు




**వేములవాడ ప్రజాబలం అక్టోబర్ 15 (ప్రజాబలం):** సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా వేములవాడ పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు.సిరిసిల్ల, కరీంనగర్ వైపు నుంచి కోరుట్ల వెళ్లే వాహనాలు మహంకాళి టెంపుల్ (అమరవీరుల స్థూపం), మున్నూరు కాపు సత్రం, సాయి రక్షా ధాబా, పెద్దమ్మ టెంపుల్, చెక్కపల్లి బస్టాండ్ మీదుగా కోరుట్ల బస్టాండ్‌కు చేరుకోవాలని సూచించారు. కోరుట్ల నుంచి వచ్చే వాహనాలు కూడా ఇదే మార్గంలో రాకపోకలు సాగించాలని కోరారు.

వాహనదారులు, పట్టణ ప్రజలు, బతుకమ్మ వేడుకలకు వచ్చే భక్తులు ట్రాఫిక్ ఆంక్షలను పాటించి, పోలీసులకు సహకరించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు

# చందర్లపాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

## కూటమి జెండా ఎగరేద్దాం!

## అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం:

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

చందర్లపాడు: మండలంలోని ప్రతి గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. 56 బూత్‌లలో 5,027 ఓట్ల ఆధిక్యం.. కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనంగత అసెంబ్లీ ఎన్నికల్లో చందర్లపాడు మండలంలోని 56 బూత్‌లలో 5,027 ఓట్ల ఆధిక్యాన్ని అందించడం ఒక్కరి విజయమో కాదని, ప్రతి గ్రామంలో ప్రతి గడపను పలకరిస్తూ, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితమని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. గత రెండేళ్లలో తల్లికి వందనం, పెంచిన పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తల పాత్ర అభినందనీయమన్నారు. గ్రామాల్లో రోడ్లు, వ్యవసాయ విద్యుత్, వైద్య సదుపాయాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రజా సమస్యల పరిష్కారంలోనూ కార్యకర్తలు తనకు అండగా నిలుస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం మళ్లీ ప్రగతి బాటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. తల్లికి వందనం, రూ. 4,000 పింఛను, అన్నదాత సుఖీభవ, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల ద్వారా పేదల కు భోజన సదుపాయం వంటి కార్యక్రమాలు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చేపట్టిన చర్యలని వివరిం చారు. వేదాద్రికంచల ఎత్తిపోతల పథకం పునరు ద్ధరణకు రూ. 15 కోట్లునందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని 37 గ్రామాలకు, 17 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే లక్ష్యంతో ఉన్న వేదాద్రి?కంచల ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లలో నిర్వహణ లోపంతో నిర్లక్ష్యానికి గురైందని సౌమ్య గారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకం పునరుద్ధరణ కోసం ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేయగా, రూ. 15 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జలవనరుల శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామానాయుడు పునరుద్ధరణ పనులను ప్రారంభించారని, 2027 ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని వెల్లడించారు.

# సన్నబడే మోజు.. ప్రాణాలకు ముప్పు!

(హెచ్. ప్రతాప్)

బరువు తగ్గాలనే ఆరాటంలో అనుమతి లేని మందులను ఆశ్రయిస్తే ప్రాణాలకే ప్రమాదమని తెలంగాణ ఔషధ నియంత్రణ సంస్థ హెచ్చరించింది. ఆన్‌లైన్ వేదికలు, సామాజిక మాధ్యమాల ద్వారా విక్రయిస్తున్న కొన్ని బరువు తగ్గించే మందులు, ప్రయోగాత్మక ఔషధ ఉత్పత్తుల వినియోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వైద్యుల సలహా లేకుండా ఇలాంటి మందులను తీసుకోవడం, ఇంజెక్షన్లు వేసుకోవడం వల్ల ప్రాణాంతక సమస్యలు తలెత్తవచ్చని స్పష్టం చేసింది.

తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అక్టోబర్ 14న ఈ మేరకు ప్రజలకు, వైద్యులకు ప్రత్యేక హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో కొందరు వైద్యులు, ఆన్‌లైన్ విక్రేతలు సరైన నియంత్రణ అనుమతులు లేని ఔషధాలను బరువు తగ్గించే చికిత్సల కోసం అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. కొన్ని ఔషధాలు ఇంకా ప్రయోగ దశలో ఉండగా, మరికొన్నింటికి విదేశాల్లో అనుమతులు ఉన్నప్పటికీ భారతదేశంలో అవసరమైన నియంత్రణ అనుమతులు లేకుండా వినియోగించడం సరికాదని హెచ్చరించింది.

అలాగే ప్రయోగాత్మక పెప్టైడ్ ఉత్పత్తులు కూడా నియంత్రణ లేని ఆన్‌లైన్ మార్గాల్లో అందుబాటులో ఉన్నట్లు గుర్తించింది. వీటి భద్రత, ప్రభావశీలత, నాణ్యతను ఆయా చికిత్సలకు సంబంధించి తగిన విధంగా నిర్ధారించలేదని వెల్లడించింది.

ముఖ్యంగా టెలిగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న విక్రయాలపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని ఉత్పత్తులను పరిశోధనలకు ఉపయోగించే రసాయనాలుగా పేర్కొంటూ, ప్యాకెట్లపై 'మానవ వినియోగానికి కాదు' అని ముద్రిస్తున్నారు. అయినప్పటికీ స్వయంగా ఇంజెక్షన్లు వేసుకునేందుకు సూచనలు, పరికరాలతో విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఇలాంటి ఉత్పత్తుల్లో పేర్కొన్న ఔషధమే ఉందా? సరైన మోతాదులో ఉందా? హానికరమైన కలుషితాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాలకు విశ్వసనీయమైన హామీ ఉండదని అధికారులు వివరించారు. ముఖ్యంగా తగిన శుద్ధి పరీక్షలు జరగని ఇంజెక్షన్ల వల్ల తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, ప్రతికూల ప్రతిచర్యలు, ప్రాణాంతక సమస్యలు సంభవించే ప్రమాదముందని హెచ్చరించారు. నకిలీ మందులు, తప్పుదోవ పట్టించే లేబుళ్లు ప్రజారోగ్యానికి ముప్పుగా మారవచ్చని పేర్కొన్నారు.

నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించి ఇలాంటి మందులను సరఫరా చేసే విక్రేతలు, రోగులకు సూచించే వైద్యులపై ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం--1940 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ సేఫ్ స్పష్టం చేసింది.

బరువు తగ్గాలనుకునేవారు అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి, అవసరమైన పరీక్షల అనంతరం అనుమతి పొందిన చికిత్సలను మాత్రమే ఎంచుకోవాలని సూచించింది. అనుమానాస్పద ఔషధ విక్రయాలపై 1800-599-6969 టోల్‌ఫ్రీ నంబరుకు పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది.

సన్నబడాలనే తొందరలో ఆరోగ్యాన్ని పణంగా పెట్టవద్దు. వైద్యపరమైన భద్రతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నదే అధికారుల హెచ్చరికలోని ప్రధాన సందేశం.

# కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం..

## రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

### బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ

### ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ

### అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ

### నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు

### ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

హైదరాబాద్ తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం



రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

# చేనేత వస్త్రాల వినియోగాన్ని..

# ప్రభుత్వ శాఖల్లో ప్రోత్సహించాలి

### చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### నాంపల్లి లోని చేనేత భవన్ లో తెలంగాణ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైద్రాబాద్ అక్టోబర్ 15: రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాంపల్లిలోని చేనేత భవన్‌లో తెలంగాణ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ నూతన కార్యాలయాన్నిచేనేత అభివృద్ధి కార్పొరేషన్ చెర్మెన్ దుడెం వెంకటరమణ,పద్మశాలి కోపరేటు కార్పొరేషన్ చెర్మెన్ శ్రీనివాస్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.




తెలంగాణ చేనేత వస్త్రాలకు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, ఈ వృత్తిపై ఆధారపడిన కార్మికుల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయాలు, అధికారిక కార్యక్రమాలు, ఉపాధ్యాయులు, ప్రముఖుల సన్మానాలు తదితర సందర్భాల్లో సాధారణ సిల్క్ శాలువాలకు బదులుగా చేనేత శాలువాలను




వినియోగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రాజకీయ నాయకులు పరస్పరం గౌరవించుకునే కార్యక్రమాల్లోనూ చేనేత శాలువాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచేలా అన్ని ప్రభుత్వ శాఖలకు తగిన సూచనలు, మార్గదర్శకాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. చేనేత రంగంలో ముడిసరుకు సమకూర్చడం నుంచి వస్త్రాల తయారీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వరకు ప్రతి దశలోనూ సంబంధిత వర్గాలకు ప్రయోజనం




కలిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించి, వారి శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా చూడాలన్నారు. చేనేత రంగం అభివృద్ధి చెందితే కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం లభిస్తాయని చెప్పారు. నూతన చైర్మన్ విద్యార్థి దశ నుంచి రాజకీయ జీవితంలో కష్టపడి పనిచేసిన స్ఫూర్తితో చేనేత రంగ అభివృద్ధికి మరింత అంకితభావంతో కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# గంజాయి, అక్రమ మద్యం నిర్మూలనపై ప్రత్యేక నిఘా..

## ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన

## ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత తనిఖీలు

మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గూడూరు సర్కిల్ పరిధిలోని కొత్తగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌతుగూడెం, చింతగట్టు తండా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొని సుమారు 120 ఇళ్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలను గుర్తించారు. అలాగే 15 లీటర్ల అక్రమ మద్యం (గుడుంబా), సుమారు 500 లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నివారణ, పోలీస్?ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతం, ప్రజల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్లు గూడూరు సీఐ వినయ్ తెలిపారు.

# గ్రామీణ మహిళల సేవలు వెలకట్టలేనివి

## వ్యవసాయం, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

గూడూరు, అక్టోబర్ 15 :అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా గూడూరు మండలం ఆర్. కనపురం గ్రామంలో గ్రామీణ మహిళల సేవలను గుర్తుచేసుకుంటూ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయం, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధిలో మహిళలు పోషిస్తున్న కీలకపాత్రను గుర్తించి, వారి శ్రమను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో పంటల సాగు, ఉత్పత్తి, పశుపోషణతో పాటు కుటుంబ పోషణలోనూ గ్రామీణ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సమాజానికి ఆహారాన్ని అందించడంలో మహిళల కృషి ఎంతో విలువైనదని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలని కోరారు. గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని నిర్మూలించేందుకు మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించి, నిర్ణయాధికారంలో వారి భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, విద్యా లోపాలు, లింగ వివక్షత వంటి అంశాలపై ప్రభుత్వాలు, సమాజం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మహిళలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ మహిళలకు తగిన హక్కులు, గౌరవం, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర గ్రామీణ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

### వార్డు సభ్యుల ఏకగ్రీవాలపై ఈసీ హెచ్చరికలు

అమరావతి ఏపీలో వార్డు సభ్యుల పదవులను ఏకగ్రీవం కోసం వేలం వేయడాన్ని తీవ్రంగా రాష్ట్ర ఎన్నికల సంఘం (రాఇఅ) ఖండించింది. ఇది అక్రమమని, దోషులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఆరేళ్ల పోటీ చేయకుండా అనర్హత వేటు వేస్తామని హెచ్చరించింది. ఈ ఆరోపణలపై విచారణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనుంది. ఆరోపణలున్న చోట కలెక్టర్ అనుమతి లేకుండా ఏకగ్రీవ ఫలితాలు ప్రకటించరు. ప్రాథమిక ఆధారాలుంటే ఆ వార్డుల్లో ఎన్నికలను నిలిపివేసే అధికారం రాఇఅకి ఉంది.

# విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం!

**వైఫల్యాలను అధికారులపై నెట్టడం దురదృష్టకరం**
**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే**
**సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15:** రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రే అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి అధికారులపై నెపం నెట్టడం బాధాకరమని సండ్ర అన్నారు. అధికారులపై పట్టు సాధించలేకపోతున్న ముఖ్యమంత్రి.. 'మీరు నా మాట వినడం లేదు' అంటూ వ్యాఖ్యానించడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. గత నెల రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యకలాపాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.

**కేసీఆర్ హయాంలో విద్యుత్ రంగంలో అభివృద్ధి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ కష్టాలు తప్పవన్న రీతిలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారని సండ్ర గుర్తుచేశారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ఒకప్పుడు విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణను విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు గత ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

రాష్ట్రం ఏర్పడిన సమయంలో 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 19,450 మెగావాట్లకు పెంచినట్లు సండ్ర తెలిపారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు సరఫరా, పంపిణీ వ్యవస్థలను కూడా విస్తృతంగా అభివృద్ధి చేశామని వివరించారు.

ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. 400 కేవీ సబ్‌స్టేషన్ల సంఖ్యను 6 నుంచి 30కి, 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 103కి, 132 కేవీ సబ్‌స్టేషన్లను 176 నుంచి 251కి పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఈహెచ్‌వీ సబ్‌స్టేషన్ల సంఖ్యను 233 నుంచి 384కి పెంచడంతో పాటు, ఈహెచ్‌టీ లైన్ల సర్క్యూట్ పొడవును 16,378 కిలోమీటర్ల నుంచి 28,131 కిలోమీటర్లకు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 14,973 ఎంవీఏ నుంచి 38,941 ఎంవీఏకు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేశామని వివరించారు.

**కొత్త విద్యుత్ కేంద్రాలతో ఉత్పత్తి సామర్థ్యం పెంపు**

కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 42 నెలల్లో పూర్తి చేశామని, భద్రాద్రిలో 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని సండ్ర తెలిపారు. యాదాద్రిలో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రం, భూపాలపల్లిలో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేసినట్లు



పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ రంగంలో 6,480 మెగావాట్లు, సౌర విద్యుత్ రంగంలో 3,600 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని సమకూర్చినట్లు వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన విద్యుత్ మౌలిక సదుపాయాలు, పనిచేసిన అధికార యంత్రాంగమే ప్రస్తుతం కూడా ఉన్నాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయో సమాధానం చెప్పాలని సండ్ర ప్రశ్నించారు. విద్యుత్ కొరతకు ఎల్‌నినో ప్రభావాన్ని కారణంగా చూపుతూ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులను బాధ్యులుగా చూపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**రైతులకు న్యాయం చేయాలి.. పంట నష్టానికి పరిహారం అందించాలి**

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. విద్యుత్ సమస్యలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, అవసరమైన ప్రాంతాల్లో కరువు మండలాలను ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ రంగంలో గతంలో సాధించిన అభివృద్ధిని కొనసాగిస్తూ ప్రస్తుత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు, అధికారులపై నిందలు వేయడం పక్కనపెట్టి ప్రజలకు, రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు.

**పలువురు నాయకుల హాజరు**

ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణరెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమ్మరాజు, అమరవరపు కృష్ణారావు, మోదుగు పుల్లారావు, బెల్లంకొండ రాము, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, జొన్నలగడ్డ విజయ్, మోరంపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధనారీశ్వరీ,అన్నపూర్ణా దేవి అలంకారాలు,పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

### - 5వేల మందికి అన్న - ప్రసాద వితరణ

**హైదర్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 15** హైదర్‌నగర్‌లోని శ్రీ శ్రీ శ్రీ జయదుర్గా మైసమ్మ (స్వయంభువు) దేవస్థానం లో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

ఐదవ రోజు అర్ధనారీశ్వరీ అలంకారం నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజున అమ్మవారిని శ్రీ అర్ధనారీశ్వరీ దేవి స్వరూపంలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.సంప్రదాయబద్ధంగా విశేష పుష్పా లంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.శివశక్తుల ఏకత్వానికి, స్త్రీ-పురుష తత్వాల సమన్వయానికి ప్రతీక అయిన ఈ దివ్య స్వరూప దర్శ నం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అన్నపూర్ణాదేవి అలంకారం

అదేవిధంగా ఈ రోజు అమ్మవారిని సమస్త జీవరాశులకు అన్నాన్ని ప్రసాదించే జగన్మాత అయిన శ్రీ అన్నపూర్ణాదేవి స్వరూపంలో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శిం చుకున్న భక్తులు సకల జనులకు అన్నపానాదులకు లోటు లేకుండా, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.

పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ వైభోగం అక్టోబర్ 15, గురువారం నాడు దేవాల యంలో శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యా ణ మహోత్సవం వైభవంగా నిర్వహించ బడింది. స్వామివారిని, అమ్మవారిని పసుపు,తెలుపు,గులాబీ రంగుల పుష్ప మాలలు,సుందర పుష్పాలంకరణలు, విశేష ఆభరణాలతో అలంకరించారు.

వేదమంత్రోచ్చారణలు,సంప్రదాయ బద్ధమైన పూజా కార్యక్రమాల నడుమ కళ్యాణ వేడుకను ఆలయ అర్చకులు నవీన్ స్వామి,చందు స్వామి,ఋత్వి కులు అజయ్ స్వామి,వినయ్ స్వామి, శ్రీకాంత్ స్వామి శాస్త్రోక్తంగా నిర్వహిం చారు.దేవాలయంలో ఋత్వికులచే నిత్య హోమంతో పాటు భక్తులచే సామూహిక సహస్రనామ కుంకుమా ర్చనలు జరిపించారు.ముఖ్యంగా ఉత్సవాలు ఘనంగా జరుగుటకు కారణమైన దాతలు,దేవి మాల దారులు,భక్తులు,గ్రామస్తులు,సేవకులు యొక్క సేవలు అనిర్వచనీయ మని జైదుర్గ మైసమ్మ ఆలయ కార్యని ర్వహణాధికారి సతీష్ బాబు తెలిపారు.

అన్నప్రసాద వితరణ: ప్రతి సంవత్సరం లాగానే దాతలు శివశ్రీ లింగైక్య నేతి శ్రీశైలం



వారి కుటుంబ సభ్యుల సహ కారంతో అమ్మవారికి నైవేద్యం సమర్పిం చిన తదుపరి సుమారు 5000 మంది భక్తులకు పెళ్లి భోజనం తరహాలో అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించా రు. అన్నదానం మహాదా నమనే భావ నకు అనుగుణంగా ఈ కార్యక్రమం అభినందనీయమని భక్తులు పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు దర్శనం, పూజా కార్యక్ర మాలకు దేవస్థానం తరపున అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో కోరారు.

## యాసంగిలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరి సాగుకు దూరంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, అక్టోబర్-15, ప్రజాబలం ప్రతినిధి:** యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.



గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొలాలను బీడుగా ఉంచుకోవాలని తెలిపారు. వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.

తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్కేపూడి గాంధీ జన్మదిన వేడుకలు



మేడ్చల్ అక్టోబర్ 15;శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ బర్త్డే సందర్భంగా ఎం ఎల్ ఏ గాంధీ నివాసం లో మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్ తన అనుచర్యలతో కలిసి గాంధీకి శాల్వతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయడం జరింగింది ఈ కార్యక్రమం లో నర్సింహా సాగర్ తిరుపతి రెడ్డి గౌస్. నరేష్ ముదిరాజ్ గణపతి. రావినాయక్ చెందు బస్వారాజ్ వాసిమ్ అజ్జార్ వినయ్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు




## మర్పల్లి సబ్ స్టేషన్ పూజా కార్యక్రమంలో పాల్గొంటున్న డి ఈ సంజీవరావు

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి సబ్ స్టేషన్ పూజా కార్యక్రమంలో నేడుపాల్గొంటున్న డి ఈ సంజీవరావు పాల్గొంటున్నట్టు మర్పల్లి ఏఈ శ్రీ రామచంద్రయ్య, తెలిపారు కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్లు లైన్మెన్లు జేఎల్ఎంలు సిబ్బంది ఆపరేటర్లు వివిధ గ్రామాల సన్నిహితులు కార్యక్రమంలో పాల్గొంటారని ఏఈ శ్రీ రామచంద్రయ్య తెలిపారు

# తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**స్వల్పకాలిక పంటలతో సాగు ప్రణాళిక రూపొందించుకోవాలి.**

**కూరగాయల సాగుపై ఆసక్తి కనబరచాలి.**

**జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డి. సంజీవరావు.**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15 ఏటూరు నాగారం** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డి. సంజీవరావు తెలిపారు.

అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా స్వల్పకాలిక పంటలతో సాగు ప్రణాళిక రూపొందించుకుని, కూరగాయల సాగుపై ఆసక్తి కనబరచాలని ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో ప్రస్తుతం సుమారు 116 ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు, వినియోగదారుల అవసరాలు, స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ పంటలను ఎంపిక చేసుకుంటే మెరుగైన లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పంట చేతికొచ్చే సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని సాగు చేపట్టాలని సూచించారు.

తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తోందని తెలిపారు. జిల్లాలో భూగర్భ జలమట్టం సుమారు 5.36 మీటర్ల లోతులో ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ బోర్లలో నీటి లభ్యత, నేల స్వభావాన్ని పరిశీలించుకుని సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని అన్నారు.

నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ పంట అవసరానికి అనుగుణంగా నీరందించాలని తెలిపారు.

టమాటా, వంగ, పచ్చిమిర్చి, బెండ, గోరుచిక్కుడు, ఆకుకూరలు వంటి కూరగాయ పంటల్లో స్థానిక పరిస్థితులకు అనువైన రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. పంట, రకాన్ని బట్టి సుమారు 30 రోజుల నుంచి నాలుగైదు నెలల వ్యవధిలో దిగుబడినిచ్చే స్వల్పకాలిక రకాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మునగ సాగుకు ఆసక్తి ఉన్న రైతులు దాని పంటకాలం, నీటి అవసరాలపై ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.

కూరగాయ పంటలను బిందు సేద్యం ద్వారా సాగు చేయడం వల్ల నీటిని సమర్థంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. నేలలో తేమను కాపాడేందుకు పంట అవశేషాలతో నేలను కప్పి ఉంచడం, కలుపును సకాలంలో తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాగు పనులు చేపట్టాలని తెలిపారు. పంటల ఎంపిక, నాణ్యమైన విత్తనాలు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ విషయంలో ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ కూరగాయల సాగు చేపట్టాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సుప్రజ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్న ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు



**మియాపూర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 15** మియాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సుప్రజ హాస్పిటల్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన హాస్పిటల్ ను సందర్శించి,అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. మాజీ మంత్రి హరీష్ రావు ఓ ప్రత్యేక విభాగా న్ని ప్రారంభించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు లో ఉండటం ఎంతో ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు.ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజల కు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,ఆలేరు ఎమ్మె ల్యేబీర్ల ఐలయ్య,మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్,బిసి కమిషన్ మెంబర్ బాలలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,, కెపి వివేకానంద గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బిసి సంఘం నేత జాజుల శ్రీనివాస్. మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, అశోక్ గౌడ్, కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ నారాయణ గౌడ్, అట్టేపల్లి రామ ప్రభు,బీఎస్ఎన్. కిరణ్, సుప్రజ హాస్పి టల్ యాజమాన్యం దంతూరి రవీందర్ గౌడ్, దంతూరి హరిశంకర్ గౌడ్, శిగ విజయ్ గౌడ్,హాస్పిటల్,వైద్యులు, సిబ్బంది,స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



# ఎల్‌నినోనూ రాజకీయాలకు వాడుకోవడం సరికాదు!

**రైతులకు కావాల్సింది విమర్శలు కాదు.. ధైర్యం, భరోసా, పరిష్కారాలు**

**బీఆర్ఎస్ విమర్శలపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15:** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో వర్షపాతం తగ్గే పరిస్థితులను సైతం రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల తలెత్తే సమస్యలను ప్రభుత్వ వైఫల్యాలుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

1951 నుంచి 2026 వరకు దేశంలో ఇలాంటి పరిస్థితులు 16 సార్లు ఎదురైనట్లు పేర్కొంటున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు ప్రభుత్వాల నియంత్రణలో ఉండవని, అయితే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచి, వారికి భరోసా కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ రైతులకు ధైర్యం చెప్పాల్సింది పోయి, ప్రతి సమస్యకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ హయాంలో కరోనా మహమ్మారి విజృంభించినప్పుడు, ఆ విపత్కర పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ విమర్శించిందా అని నిలదీశారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష బాధ్యతేనని, అయితే ప్రకృతి, వాతావరణ పరిస్థితులను సైతం రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. రాజకీయాలు చేయాల్సిన



అంశాలపై విమర్శలు చేయాలని, కానీ ప్రతి విషయాన్నీ రాజకీయ కోణంలో చూడకూడదని హితవు పలికారు.

ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో విమర్శలకే పరిమితమైతే ప్రజల్లో చులకనయ్యే ప్రమాదం ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

రైతులకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు.. ధైర్యం, భరోసా, సమస్యలకు పరిష్కారాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పేర్కొన్నారు.

# 19న దసరా ఉత్సవాలు - సినీ నటుడు శివారెడ్డి తో స్టేడియంను సందర్శించిన మేయర్ మహంకాళి స్వామి, కమిషనర్ అరుణశ్రీ





**పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్-15, ప్రజాబలం ప్రతినిధి:** ఈ నెల 19 న గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సి ఎల్ తదితర సంస్థల సౌజన్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ , సినీ కళాకారుడు శివారెడ్డితో కలిసి దసరా ఉత్సవాల వేదిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ను సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఉత్సవాలను వీక్షించేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. స్థానిక కళాకారుడు , ప్రముఖ సినీ ఆర్టిస్ట్ శివారెడ్డి ఆద్వర్యంలో సినీ,టీవి ఆర్టిస్ట్ లతో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు . వాటిని వీక్షించడానికి నిర్ణీత సమయానికంటే ముందే ప్రజలు స్టేడియంకు చేరుకోవాలని అన్నారు.

సినీ కళాకారుడు శివారెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం తన ఆద్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలకు మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ దఫా మరింత అలరించే సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ, జానపద కళాకారులతో పాటలు, నృత్యాలు, ఫైర్ షో, రావణా సుర దహనం తదితర అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు , స్థానిక కళాకారుల ప్రదర్శనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో నిర్వహించే మాదిరిగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో రామగుండంతో పాటు చుట్టుప్రక్క పల్లెలు, పట్టణాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు.

ఈ సందర్భంగా ఎ సి పి ఎం.రమేష్ , సింగరేణి ఆర్జివన్ జి.ఎం లలిత్ కుమార్, సింగరేణి శ్రీనివాస్, పలువురు కార్పొరేటర్లు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ వేళంలో వేసిన స్క్రాప్ వాహనాలు మళ్లీ రోడ్డుపైకి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని. ఎక్సైజ్ శాఖ ఆఫీస్ వద్ద సెప్టెంబర్ 24 లో నిర్వహించిన వేలం పాటలో దక్కించుకున్న వాహనాలను ఐరన్ గిడ్డంగులలో అమ్ముకోవాలి ఆ వాహనాలు మరల రోడ్డుపై నడిచే వీలు లేకుండా వాటిని గ్యాస్ కట్టర్ తో కట్ చేసి వాటిని తీసుకొని వెళ్లారు

ఇ తంతు అంత సంబంధిత ఎక్సైజ్ అధికారి సీఐ లేక స్టేషన్ ఎస్ఐ గారి ముందు స్క్రాప్ అంతా జరగాలి

కానీ వాహనాలను స్క్రాప్ చేసే సమయంలో ఇట్టి అధికారులు ఆఫీస్ వద్ద లేకపోవడంతో వాహనాలను కొనుగోలు చేసిన వారు మరల ఇట్టి వాహనాలను ఎలాంటి సమస్యలు లేకుండా వాటిని కట్ చేసి మరల మార్కెట్లో అమ్మాలని ఆలోచనతో సిఐ గారితో చేతులు కలిపి వాహనాలను స్క్రాప్ చెయ్యకుండాతరలించారు ఇట్టి వ్యవహారంపై సంబంధిత సీఐని అడగగా ఎలాంటి సమాధానాలు చెప్పకుండా వెనుతిరిగారు దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని విచారణ చేపట్టాలని అధికారులను కోరారు 35 బండ్లకు 32 మాత్రమే స్క్రాప్ చేసి 3 వాహనములు స్క్రాప్ చెయ్యకుండా వదిలి వేశారని అన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. రేణిగుంట రైల్వే స్టేషన్, పార్సల్ ఆఫీసు లో తిరుపతి రూరల్ ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు...

రేణిగుంట ?చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసా ఆచారి ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమలులోకి వచ్చిన సందర్భంగా తిరుపతి రూరల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నరస నాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ కవీశ్వర్ నాయుడు మరియు వారి సిబ్బంది కలసి అక్టోబర్ 15 తేదీ గురువారం రేణిగుంట రైల్వే స్టేషన్ మరియు రేణిగుంట పార్సల్ ఆఫీస్ నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా తరలించే నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ గంజాయి మరియు ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఈ విస్తృత సోదాలు చేపట్టడం జరిగింది. ఈ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా రైల్వే పార్సల్ కార్యాలయానికి వచ్చిన పలు అనుమానాస్పద పార్సళ్లను, లగేజ్ బాక్సులను అలాగే ప్రయాణికుల సంచులను ఎక్సైజ్ బృందం అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఎటువంటి అక్రమ పదార్థాలు గానీ లేదా నిషేధిత వస్తువులు గానీ లభించలేదని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. అనంతరం తిరుపతి రూరల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నరస నాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పూర్తయ్యేంత వరకు ఎక్కడ కూడా అక్రమ మద్యం, గంజాయి రవాణా జరగకుండా నిరంతరంగా తనిఖీలు కొనసాగిస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నిర్మాణం పూర్తికాకముందే రాకపోకలు.. తరచూ ప్రమాదాలు.

## సింగరేణి అధికారులు స్పందించాలి.. లేదంటే ప్రజల తరపున పోరాటం: బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోత్ విజయ్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15:** పట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో నూతన రహదారి నిర్మాణ పనులు పూర్తికాకముందే వాహనాల రాకపోకలకు అనుమతించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సత్తుపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బానోత్ విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తి రహదారిపై ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.









సత్తుపల్లి పట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రధాన రహదారిని మూసివేసి, ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్న నూతన రహదారి పనులు పూర్తికాకముందే వాహనాల రాకపోకలు కొనసాగించడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని విజయ్ తెలిపారు. రహదారిపై కంకర రాళ్లు, మట్టి, గుంతలు ఉండటంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఇదే రహదారిపై ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకముందే అధికారులు స్పందించాలని కోరారు. రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రయాణానికి సురక్షితంగా ఉందని నిర్ధారించిన తర్వాతే పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ప్రజల భద్రతపై నిర్లక్ష్యం తగదు

వేల కోట్ల రూపాయల టర్నోవర్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సింగరేణి సంస్థ ప్రజల భద్రత విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బానోత్ విజయ్ అన్నారు. సంస్థ అవసరాల కోసం చేపడుతున్న పనుల కారణంగా ప్రజలు ప్రయాణించే మార్గంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడితే ఎలా చూస్తూ ఊరుకుంటారని ప్రశ్నించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

జనరల్ మేనేజర్ స్పందించడం లేదని ఆరోపణ

ఈ సమస్యపై వివరణ కోరేందుకు సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌కు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని బానోత్ విజయ్ తెలిపారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన సమస్యపై వివరణ కోరినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు గుర్తించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలి

అసంపూర్తి రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అప్పటివరకు ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని బానోత్ విజయ్ డిమాండ్ చేశారు. రహదారిపై ఉన్న కంకర రాళ్లు, మట్టి, గుంతలను తొలగించి ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దాలని సూచించారు. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు రాత్రివేళల్లో స్పష్టంగా కనిపించే సూచికలను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజల భద్రత విషయంలో సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, సత్తుపల్లి పట్టణ ప్రజల తరఫున బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని బానోత్ విజయ్ హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# దుర్గామాత నవరాత్రి ఉత్సవా కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారి దర్శనం చేసుకున్న.. రవి సింగ్

**కూకట్పల్లి (ప్రజాబలం ) అక్టోబర్ 15 :** కూకట్ పల్లి నియోజకవర్గం కైతలాపూర్ డివిజన్ ఆంజనేయులు నగర్ కాలనీ వద్ద దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈ సందర్భంగా నాయకులు రవి మాట్లాడుతూ, దుర్గామాత అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## వ్యవసాయ అధికారిణి లావణ్యకు జాతీయ స్థాయి అవార్డు

## మహిళా కిసాన్ దివస్ సందర్భంగా అవార్డు ప్రదానం

**జహీరాబాద్, అక్టోబరు 15 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి నీరడి లావణ్య జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. మహిళా రైతులను ప్రోత్సహించడంతోపాటు వ్యవసాయ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను గుర్తించి ప్రోత్సహించడంలో భాగంగా ఏటా అక్టోబరు 15న నిర్వహించే జాతీయ మహిళా కిసాన్ దివస్ సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు.వ్యవసాయ శాఖలో గత కొన్నేళ్లుగా లావణ్య అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేయడంలో చూపిన చొరవ, నూతన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ వారిని ఆధునిక వ్యవసాయం వైపు మళ్లించేందుకు చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వివిధ విభాగాల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన లావణ్యకు అవార్డు లభించడం జహీరాబాద్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. వ్యవసాయ రంగంలో రైతులకు సేవలందిస్తూ జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ వ్యవసాయ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మహేందర్ కుమార్ ద్వివేది, ఆతిష్ చంద్ర చేతుల మీదుగా లావణ్య ఈ అవార్డును అందుకున్నారు.




# పండుగ వేళ మహిళలకు చీరల కానుక

## బర్దిపూర్ సర్పంచ్ రాజు సేవలను అభినందించిన సిద్ధేశ్వరానందగిరి మహారాజ్

**జహీరాబాద్, అక్టోబర్ 15 ప్రజాబలం ప్రతినిధి:** దసరా పండుగను పురస్కరించుకొని జరా సంఘం మండలం బర్దిపూర్ గ్రామ సర్పంచ్ రాజు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గురువారం గ్రామానికి చెందిన పేద, మధ్యతరగతి మహిళలకు తన సొంత నిధులతో చీరలు అందజేశారు. ఈ సందర్భంగా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ ప్రతి మహిళను తల్లిగా భావించి గౌరవించాలని సూచించారు. మహిళల పట్ల గౌరవభావం, మంచి సంస్కారాలను అలవర్చుకోవాలని అన్నారు. మహిళలకు పండుగ కానుకలు అందించిన సర్పంచ్ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తుకారాం, వార్డు సభ్యులు చింతచెట్టు రాజేందర్, అలిగి ప్రేమ్ కుమార్, పిరమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రపంచ చేతులు కడుక్కోవడం దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



**కూకట్పల్లి (ప్రజాబలం) అక్టోబర్ 15 :** పాపిరెడ్డి నగర్ లో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే (ప్రపంచ చేతులు కడుక్కోవడం దినోత్సవం) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర నగర్ డివిజన్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, కూకట్‌పల్లి జోన్ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ హెచ్, మెడికల్ ఆఫీసర్ కుకట్పల్లి జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ నాగేష్ నాయక్ పారిశుద్ధ్య కార్మికులు ఎంటమాలజీ సిబ్బందికి చేతులు కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత, చెత్తను తాకిన తర్వాత, కలుషితమైన ప్రదేశాలను తాకిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.తినడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలు కలుషితం కాకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,శుభ్రమైన దుస్తులుధరించాలని,గోర్లు కత్తిరించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డ్ ఎంటమాలజీ సూపర్‌వైజర్లు, డి నరసింహులు ,సిహెచ్ నరేష్, ఎస్ ఆర్ పి చైతన్య ప్రకాష్, ఎస్ ఎఫ్ ఏ పారిశుద్ధ్య, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

# 2బి బార్ల లాటరీకి దరఖాస్తుదారులు హాజరుకావాలి

## రేపు ఉదయం 11 గంటలకు ఐడీఓసీలో ఎంపిక

**మేడ్చల్--మల్కాజిగిరి ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 15:** జిల్లాలోని అలియాబాద్-1, మూడుచింతలపల్లి-2, ఎల్లంపేట-2 బార్లకు సంబంధించి లాటరీ విధానంలో ఎంపిక ప్రక్రియను శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు.షామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో (ఐడీఓసీ) జిల్లా కలెక్టర్ సమక్షంలో ఉదయం 11 గంటలకు లాటరీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా బార్లకు దరఖాస్తు చేసుకున్న వారంతా శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్‌కు హాజరుకావాలని సూచించారు.

# బార్ల లక్కి బార్ల లక్కి డ్రాకు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్ టీసీయుఆర్ (తెలంగాణ క్యూర్ అర్బన్ రీజియన్) పరిధి లోని 14 బార్లకు, మిగిలిన కార్పొరేషన్ మునిసిపాలిటీల్లో 27 బార్లకు వచ్చిన దరఖాస్తుల్లో శుక్రవారం జరిగే లక్కి డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక కోసం ఎక్సైజ్శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు 4251 దరఖాస్తులు వచ్చాయి. కార్పొరేషన్ మునిసిపాలిటీల్లోని 27బార్లకు 4519 దరఖాస్తులు వచ్చాయి. టీసీయుఆర్తో పాటు అన్ని జిల్లాలో ఈ నెల 16 శుక్రవారం ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారని ఎక్సైజ్ శాఖ పేర్కొంది. టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు సంబంధించిన లక్కి డ్రాను ప్రొహిబిషన్ అండ్

ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ తీస్తారు. మిగిలిన జిల్లాలో ఆయా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా లక్కి డ్రాలో బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారు. టీసీయుఆర్లోని 14 బార్లకు సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

దరఖాస్తుదారులకు ఇప్పటికే వాట్సాప్ ద్వారా..ఫోన్ ఎస్ఎంఎస్ ద్వారా సమాచారాన్ని చేర వేశామని అందరు ఉదయం తొమ్మిది గంటల వరకు హజరు కావాలని డిప్యూటి కమిషనర్లు కోరారు. మిగిలిన కార్పొరేషన్ మునిసిపాలిటీల్లో 27 బార్లకు వచ్చిన దరఖాస్తుల్లో శుక్రవారం జరిగే లక్కి డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక కోసం ఎక్సైజ్శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.టీసీయుఆర్ పరిధిలోని 14 బార్లకు 4251 దరఖాస్తులు వచ్చాయి. కార్పొరేషన్ మునిసిపాలిటీల్లోని 27బార్లకు 4519 దరఖాస్తులు వచ్చాయి. టీసీయుఆర్తో పాటు అన్ని జిల్లాలో ఈ నెల 16 శుక్రవారం ఉదయం 11 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా ద్వారా బార్ లైసెన్సీలను ఎంపిక చేస్తారని ఎక్సైజ్ శాఖ పేర్కొంది..!

# 9వ ఫేజ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో సమావేశమైన ..బండి రమేష్




**కూకట్‌పల్లి(ప్రజాబలం)అక్టోబర్ 15 :** కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు ఈరోజు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గాభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఆయనకు పరిచయం చేసి, కాలనీలో నెలకొన్న సమస్యలు, మౌలిక సదుపాయాల అవసరాలు, నివాసితుల సంక్షేమం, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, ప్రజల అవసరాలను గుర్తించి ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

అలాగే, 9వ ఫేజ్ కాలనీ అభివృద్ధి కోసం నూతన కార్యవర్గ సభ్యులు చేస్తున్న కృషిని అభినందిస్తూ, సీనియర్ సిటిజన్స్ అనుభవం, సలహాలు, మార్గదర్శకత్వం కాలనీ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పెద్దల సూచనలను గౌరవిస్తూ, యువత కాలనీ వాసుల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కాలనీ అభివృద్ధి అనేది ఏ ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి నివాసితుడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని బండి రమేష్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో పనిచేస్తూ, 9వ ఫేజ్ కాలనీని పరిశుభ్రమైన, సురక్షితమైన, మెరుగైన మౌలిక సదుపాయాలు కలిగిన ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులకు, కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టే నిర్మాణాత్మక కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.జి.రామకృష్ణారెడ్డి, కె. రాహుల్, కె. చంద్ర మోహన్ రెడ్డి, ఎం. వీర గోవిందరావు, ఎన్.తిలక్ కుమార్, కృష్ణార్జున రెడ్డి, ఈశ్వర రెడ్డి, పి.వి. సత్యనారాయణ, యాదిరెడ్డి, వై. వెంకటరత్నం, విజయ్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ రాజు, మధుసూదన్ రెడ్డి, చారి, నందయ్య, బాబూరావు, బి. వెంకటేశ్వరరావు, కిల్లారు శ్రీనివాస్ బాబు, చావా శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ మర్పల్లి మండల మాజీ అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయం

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల మానయ్య అనారోగ్యంతో మరణించడం జరిగిందిఇట్టి విషయం బి.ఆర్.ఎస్,పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న బి ఆర్ ఎస్,పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి శ్రీకాంత్ రెడ్డివారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు



అంత్యక్రియల కొరకు మృత్యుని కుటుంబానికి 5000/- రూపాయలుఆర్థికసహాయం పంపగా మాజీ సర్పంచ్ ఇందిర అశోక్ మాజీ ఎంపీటీసీ రవి మైనారిటీ నాయకులు షఫీ గ్రామ పార్టీ అధ్యక్షులు అశోక్ మృత్యుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పెద్దోళ్ల లక్మయ్య లాలు గౌడ్ మొగిలిగుండ్ల నర్సిములు చెంద్రయ్య రమేష్ రవి చాకలి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

## మహిళల ఆత్మీయత, సమైక్యతకు ప్రతీక బతుకమ్మ

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 15:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళల ఆత్మీయత, సమైక్యతకు చిహ్నంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, డీఆర్‌డీఓ, వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు ఎస్సీ, ఎస్టీ,





బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, నృత్యాలతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సాంస్కృతిక సారథులు ఆలపించిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. బతుకమ్మ పండుగ మహిళల సాధికారతతో పాటు ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సతీమణి రాధా, డిప్యూటీ కలెక్టర్లు మోక్షిత, బరీరా ఫరీద్, లా ఆఫీసర్ చంద్రావతి, బీసీ సంక్షేమ అధికారి ఝాన్సీరాణి, ఎస్టీ సంక్షేమ అధికారి పద్మజ, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, ఎస్టీఓ అలివేలుమంగ, ఉద్యానవన అధికారి శ్రీధర్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, కలెక్టరేట్ మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ఉత్సాహంగా భజన పోటీలు

**జహీరాబాద్, అక్టోబర్ 15 ప్రజాబలం ప్రతినిధి:** పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయాలకు తరలివస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని భవాని మందిరంలో






శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. మాణిక్ ప్రభు వీధి, రాచన్నపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాల వద్ద కూడా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తితో అమ్మవారిని కొలుస్తున్నారు. పట్టణంలోని వాసవి మాత ఆలయంలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయాల్లో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఉత్సాహంగా భజన పోటీలు

భవాని మందిరంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న భజన పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు పోటీల్లో పాల్గొంటూ అమ్మవారి కీర్తనలు, భక్తిగీతాలను ఆలపిస్తున్నాయి. భక్తి రసభరితమైన పాటలతో కళాకారులు భక్తులను మైమరిపిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. భజన బృందాల గానంతో భవాని మందిరం పరిసరాలు భక్తిమయంగా మారుతున్నాయి. కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల రాకపోకలు పెరగడంతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు కుటుంబసమేతంగా ఆలయాలను సందర్శిస్తూ అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం!

## లారీని వెనుక నుంచి ఢీకొన్న ఐచర్ వాహనం..

## నుజ్జునుజ్జయిన క్యాబిన్.. డ్రైవర్ మృతి చెందినట్లు సమాచారం!

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15** :కల్లూరు మండల పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వీఎం బంజర వైపు వెళ్తున్న లారీని, వెనుక నుంచి వచ్చిన ఐచర్ వాహనం బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ఐచర్ వాహనం క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రతకు క్యాబిన్ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్ మృతి చెందినట్లు సమాచారం.

ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

హైదరాబాద్ లోని పాతబస్తీలో రూ1.20 లక్షల లంచం తీసుకుంటూ విద్యుత్ ఏఈ ఏసీబీ కి పట్టుబడ్డాడు. సంతోష్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని మదన్నపేట సెక్షన్కు చెందిన విద్యుతు శాఖ ఏఈ పండల సందయ రాకేష్...ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ.1,20,000 లంచం డిమాండ్ చేసాడు. లంచం డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. రాకేష్ నుంచి లంచం నగదు స్వాధీనం చేసుకున్నారు.

## వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బ్లాక్ టు అధ్యక్షులు కృష్ణారెడ్డి, మంత్రిగారి డాక్టర్ కృష్ణ గౌడ్ ను ఘనంగా సన్మానం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం వికారాబాద్ జిల్లా నాయకులు బ్లాక్ టు కృష్ణారెడ్డి పంచలింగాల్ మంత్రిగారి డాక్టర్ కృష్ణ గౌడ్ ను ఘనంగా సన్మానించారు డాక్టర్ కృష్ణ గౌడ్ మంచి సుపరిచితులు స్నేహభావం గలవారు వారు అంటే మాకు అపరమైన ప్రేమ అభిమానం ఎంతో కాలంగా మా మధ్య ఇంత మంచి ఆత్మీయ స్నేహబంధం ఉందని బ్లాక్ టు కృష్ణారెడ్డి తెలిపారు డాక్టర్ కృష్ణ గౌడ్ అంటే మాకు ఎంతో అపారమైన ప్రేమ అందుకే వారిని దేవుడు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మల్లన్న స్వామిఆశీర్వదించాలని ప్రేమతో శాలువా సమర్పించి ఘనంగా సన్మానం చేయడం జరిగిందని జిల్లా కాంగ్రెస్ పార్టీబ్లాక్ టు కృష్ణారెడ్డి, జయంత్ రెడ్డి, సన్మాన కార్యక్రమంలో పెద్దలు పాల్గొన్నట్టు తెలిపారు

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

### ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి నేరుగా వేతనాలు చెల్లించాలి.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రి ఎన్ హెచ్ ఎం జేఏసీ ఇంచార్జ్ గంగ భవాని మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలందించిన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సేవలు . ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రి వద్ద తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది




రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి,మధ్యవర్తి ఏజెన్సీల ప్రమేయం లేకుండా స్టేట్ హెల్త్ వ్యవస్థ ద్వారా ఉద్యోగులకు నేరుగా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో వివిధ క్యాడర్లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చూపాలని సూచించారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఉద్యోగులతో నేరుగా చర్చలు జరిపి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని, ఉద్యోగి మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా రూ.20 లక్షల బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చెల్లించాలని కోరారు. ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఉద్యోగుల వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వారితో చర్చలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గంగ భవాని శ్వేత సౌజన్య స్వప్న సంధ్య దివ్య సుకన్య సుమలత మానస నిర్మల యశోద గంగాధర్ రాజేష్ దేవరాజ్ భరత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## దార్లపల్లి ఉపసర్పంచ్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో తెలంగాణ బిడ్డల పేదింటికల నెరవేర్చేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే అనే నినాదాన్ని నిజం చేస్తూ దార్లపల్లి ఉపసర్పంచ్ సలీమా బి హైముద్దీన్ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, స్థానిక గ్రామ సర్పంచ్ తలారి యాదమ్మ బాల్ రాజ్ తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను ఘనంగా శాలువాతో సన్మానించడం జరిగిందని తెలిపారు, కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు వాడు మెంబర్లు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని మా గృహా ప్రవేశానికి విచ్చేసినందుకు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కి పెద్దలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియపరుస్తున్నాను అని యువ నాయకుడు ఉపసర్పంచ్ కుమారుడు అక్రమ్ తెలిపారు

## ఎనిమిది వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన తాహశీల్దార్

వేములవాడ రూరల్ కార్యాలయానికి చెందిన తహసీల్దార్ కమ్ జాయింట్ సబ్–రిజిస్ట్రార్ మహమ్మద్ అబూబకర్ లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. గురువారం నాడు బాధితుడు తన అత్తకు చెందిన వ్యవసాయ భూమిని తన తండ్రికి బహుమతి దస్తావేజును నమోదు చేయాలని కోరాడు. అందుకుగాను వేములవాడ రూరల్ కార్యాలయానికి చెందిన భూ భారతి ఆపరేటర్ శంకసాల అనిల్ కుమార్ ద్వారా రూ. 8,000/– లంచం డిమాండ్ తాహశీల్దార్ చేసి, స్వీకరించగా కరీంనగర్ రేంజ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

## యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు.

### టాస్క్ కేంద్రంలో ఈ నెల 31 వరకు పేర్ల నమోదు చేసుకోవాలి.

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15 కలెక్టరేట్**ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

రిటైల్ రంగంతో పాటు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు ఉద్దేశించిన రెండు వేర్వేరు శిక్షణ కార్యక్రమాలకు అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 31వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ల్యాండ్‌మార్క్ గ్రూప్ ఫౌండేషన్ సహకారంతో హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ అమలు చేస్తున్న 'మేక్ ఇండియా కేపబుల్' కార్యక్రమంలో భాగంగా యువతకు ఉచిత ఉద్యోగ సన్నద్ధత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

ఈ శిక్షణలో 30 రోజుల పాటు తరగతి గదిలో బోధన, ఆచరణాత్మక అభ్యాసం ఉంటాయని తెలిపారు. అనంతరం ఏడు రోజుల పాటు పని ప్రదేశంలో ప్రత్యక్ష శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహకారం అందించనున్నట్లు వివరించారు.

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలోని టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రం, ఎక్సెల్‌ఆర్ సంస్థ సహకారంతో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాల్లో ఉపాధి అవకాశాలకు అనుసంధానంగా మరో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 45 రోజుల పాటు తరగతి గదిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. సంబంధిత రంగాల ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు నేర్పించి, ఉపాధి అవకాశాలు పొందేందుకు తోడ్పాటు అందించనున్నట్లు వివరించారు.

ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ములుగులోని బండారుపల్లి రోడ్డులో ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న టాస్క్ ములుగు ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించి, తాము చేరదలచిన శిక్షణ కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రెండు కార్యక్రమాలకు పేర్ల నమోదుకు చివరి తేదీ 31.10.2026 అని స్పష్టం చేశారు.

శిక్షణ తరగతుల ప్రారంభ తేదీలు, ప్రవేశ ప్రక్రియ, ఇతర పూర్తి వివరాల కోసం టాస్క్ సెంటర్ కోఆర్డినేటర్ మురళి కృష్ణ 9490500282, 9618449360 నంబర్లలను సంప్రదించాలని తెలిపారు.

సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు ఈ శిక్షణ కార్యక్రమాల వివరాలను అర్హులైన యువతకు తెలియజేసి, గడువులోగా పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

## కొత్త ఆలోచనలకు మార్గదర్శకంగా 'ఇన్నోవేషన్ పంచాయతీ'.

### ఈ నెల 17న ములుగు కలెక్టరేట్‌లో నిర్వహణ.

### జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 15 కలెక్టరేట్** గ్రామీణ ఆవిష్కర్తల ఆలోచనలను ప్రోత్సహించి, వాటి అభివృద్ధి అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు ఈ నెల 17న ములుగు కలెక్టర్ కార్యాలయంలో ఇన్నోవేషన్ పంచాయితీ నిర్వహించుచున్నట్లు తెలిపారు

తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన ఆవిష్కర్తలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులు, యువత, చేతివృత్తిదారులు, గృహిణులు, అంకుర సంస్థల నిర్వాహకులు తమ వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలతో పాల్గొనాలని కోరారు.

కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం, తయారు చేసిన నమూనాలను మెరుగుపరచడం, సాంకేతిక సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై నిపుణులు నేరుగా సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. ఆవిష్కరణలను వ్యాపార అవకాశాలుగా మలచుకోవడం, ఆర్థిక సహాయం పొందేందుకు అందుబాటులో ఉన్న మార్గాలపై మార్గదర్శకత్వం లభిస్తుందని పేర్కొన్నారు.

ఆవిష్కరణల అవసరం, అర్హతను బట్టి నమూనాల తయారీకి సహకరించే కేంద్రాలతో అనుసంధానం, మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, అంకుర సంస్థల అభివృద్ధికి తోడ్పడే సంస్థల ద్వారా సహకారం పొందే అవకాశాలపై సూచనలు అందిస్తారని తెలిపారు. వ్యవసాయం, పారిశుధ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ వేదిక దోహదపడుతుందని పేర్కొన్నారు.

పాల్గొనేవారు తాము తయారు చేసిన ఆవిష్కరణల నమూనాలను వెంట తీసుకురావాలని సూచించారు. నమూనాలను తీసుకురావడం సాధ్యం కానివారు వాటి పనితీరును వివరించే చిత్రాలు, దృశ్యాలను తమ చరవాణిలో సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.ఆసక్తి గలవారు https://forms.gle/ptQKzxb7VCymuynT8 లింకు ద్వారా ముందస్తుగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మూడు జిల్లాల్లోని ఆవిష్కర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా తీర్చిదిద్దుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంపత్ రావు కోరారు.

## పట్లూర్ వీధిలైట్లతో అందంగా ముస్తాబ్ గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 15 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామం వీధిలైట్లతో చూడముచ్చటగా దగదగా వీధిలైట్లు మెరిసిపోతున్నాయని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు పట్లూర్ చక్కగా అభివృద్ధి ప్రథంలో దూసుకెళు ంది అంటే గ్రామ పెద్దల సహకారం గ్రామ నాయకుల సహకారం ప్రియతమా నాయకులు వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆశీర్వాదమేనని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com